

ఆంధ్రజ్యోతి
సచిత్ర వారపత్రిక
1997 దీపావళి
ప్రత్యేక సంచిక

# సందేశం

కలువకొలను సదానంద

మహారాజశ్రీ మార్తాండ వర్మగారు! వారి పట్టపు దేవీ రాణీ రంగమ్మగారు!!

ఆ రాజా వారికీ, రాణీ వారికి రాజ్యమే లేదు. వాళ్ళ తాత ముత్తాతల కుండేవి రాజ్యాలు. ముత్తాతగారు కొంచెం, తాతగారు కొంచెం, తండ్రి గారు కొంచెం క్రమంగా పోగొట్టుకుంటూ వచ్చారు. ఆఖరున మిగిలినదంతా రాజా మార్తాండవర్మ అర గదీ సేశారు. ఇక ఆయనకు మిగిలిందల్లా రాజఠీవి మాత్రమే.

రాజావారి దివాణంలో ఇప్పుడెవరూ కొలువుకు లేరు. అసలాయనకు దివాణం అంటూ ఒకటుంటే కదా? మేడలు లేవు, గోడలూ లేవు. ఖజానాలు లేవు. భజనాలు లేవు. పరివారం మాత్రం నిండు వుగా వుంది. ఆ పరివారంలోని వాళ్ళంతా ఎవరు? అందరూ ఆయన బిడ్డలే!

తన బిడ్డలందరూ గొప్ప గొప్ప వాళ్ళయిపోవా లని రాజుగారి కోరిక. రాజుగారు తలుచుకుంటే దెబ్బలకు కొదవా?

ఎవరెవరూ ఏమేమీ కావాలని తాను అనుకు న్నాడో, వాళ్ళకు ఆయా పేర్లే పెట్టాడు. ఒకడి పేరు డాక్టరు. రెండో వాడి పేరు ఇంజనీరు. మూడో వాడి పేరు ప్రొఫెసరు. నాలుగోవాడి పేరు జస్టిస్. ఐదో వాడి పేరు జనరల్ – ఇలా ఒక్కడికీ ఒక్కొక్క పేరు. అయితే అందరికీ బడి జీతాలు కట్టలేక, పుస్తకాలూ యూనిఫాంలూ వగైరా కొన లేక, 'చదువు చాలించేయండ్రా" అన్నారు రాజా వారు. డాక్టరు దీర్ఘరోగి అయినాడు. ఇంజనీరు రోడ్డు కూలీ అయినాడు. ప్రొఫెసరుకు ఓనమాలు రాలేదు. జస్టిస్ దొంగతనం చేసి జైలుకెళ్ళాడు. ఇలా ఒక్కొక్కరూ ఒక్కొక్క విధంగా తయారయ్యారు.

వాళ్ళందరికీ క్షణం తీరిక లేదు, పైసా సంపా దన లేదు. ఎప్పుడూ ఇంట్లోనే వుంటారు. ఇంట్లో ఏం చేస్తుంటారు? కలో గంజో తాగుతూ పడి వుంటారు.

అందరూ అందలమెక్కితే, మోసే వాళ్ళెవరు? అందరూ తింటూ కూర్చుంటే, తెచ్చి పడేసి వాళ్ళె వరు? వున్నారు గదా, అంతటి మార్తండవర్మగారుశ్రీ

పట్టీలు తెగిపోయిన సంచీలో శేరో అర్ధశేరో నూకలు తరచు తెస్తుంటారు. నూకలు అప్పిచ్చిన శెట్టిగారు అడపా దడపా వారి ఇంటిమీదికి దాడి చేస్తుంటారు. అప్పుడు రాణీగారు రాజావా రిని పెరట్లో దాచి పెట్టి "లేరండీ శెట్టిగారు!" అంటుంటారు.

"రాజావారు కనిపించనీ, ఏం చేస్తానో" అంటూ శెట్టిగారు రుసరుస లాడుతూ వెళ్ళిపోతాడు.

తనకు వారసత్వం సంక్రమించినప్పటి నుంచీ రాజా వారు అద్దె ఇళ్ళలోనే జీవిస్తున్నారు. ఇలా వారు పరివార సమేతంగా ఎన్నో అద్దె ఇళ్ళు మారారు. అలా మారినప్పుడల్లా ఆ ఇంట్లో వున్న నల్లు లన్నీ వారితోబాటే కదులుతుంటాయి. ఎందుకు? రాజావారి కుటుంబం చిన్నదా, చితకదా! అందు రున్న చోట ఆ నల్లులకు తిండి కరువు వుండదు కదా? వాళ్ళను వదిలేసి, పాత ఇంటినే నమ్ముకొం టాయా నల్లులు? ఆ అద్దె ఇంటికి కొత్తగా వచ్చే కుటుంబం పరిమితమైనది అయితే వాటి నోళ్ళలో దుమ్మే కదా!

రాజావారికి ఎందరో బంధువులున్నారు. అంత కంటే ఎక్కువ మంది మిత్రులున్నారు. అయితే ఎవ్వరూ రాజావారికి పెళ్ళి పత్రికలివ్వరు. విందు భోజనాలకు ఆహ్వానించారు.

'కుటుంబ సమేతంగా విచ్చేయ ప్రార్థన' అని వుంటుంది కదా పెళ్ళి పత్రికల్లో? రాజావారి కుటుంబాన్ని చూస్తే అందరికీ హడలే! పెళ్ళి భోజనాలు ఆ ఒక్క కుటుంబానికే సరిపోతే, మిగిలిన అతిథుల గతి ఏం కావాలి? .... అయినా రాజావారికి పెళ్ళి భోజనాల మీద కక్కుర్తిలేదు. తనపెళ్ళిలో తిన్నారుగా? జన్మంతా అదే చాలు!

అమ్మా, నీ కోసం పండు తెచ్చానని అర్జునుడు అన్నాడట. అయితే నాయనా, మీ అయిదుగురూ ఆ పండును పంచుకోండని కుంతీదేవి అన్నదట. అప్పుడు పంచ పాండవులు ఆ పండును సమంగా పంచుకొన్నారట! ఇది మనకు తెలుసు. రాజావారి కుమార రత్నాలు సహజీవనంలో పంచ పాండవుల కంటే తక్కువ వాళ్ళు కారు. ఏడుగురు రాజ కుమారులూ కలిసి రెండుమూడు జతల బట్టలే వాడుకొంటున్నారు. ఇద్దరు బయట తిరుగుతుంటే, అయిదుగురు లోపల వుంటారు.

రాజావారు సపరివారంగా పొరుగూళ్ళకు వెళ్ళడం మిక్కిలి అరుదు. అందుకు కారణం లేకపోలేదు. ఓసారి చిత్తూరు నుంచి పలమనేరుకు సపరివా రంగా వెళ్ళవలసి వచ్చింది. బస్సులోనైతే గంటలోపు ప్రయాణం. పలమనేరు వెళ్ళే బస్సులు అరగంటి కొకటి చొప్పున వున్నాయి కదా! రాజావారు రాణీ గారిని చేర బిలిచి "దేవీ, పలమనేరుకు నడిచి వెళ్ళి నడిచి వద్దామా, లేక హాయిగా బస్సులో వెళ్ళి, బస్సులో వచ్చి, రెండు రోజులు పస్తులుందామా" అని అడిగారు.

"తింటున్నదే అర కడుపు తిండి! అదైనా లేకుంటే ఎలా ప్రభూ!" అంది రాణి. ఆయమ్మ గారి సలహా మేరకు అందరూ నడిచి వెళ్ళి, నడిచి వచ్చారు.

రాజా వారి వలన వారి వంశం వన్నె తరగలేదు. పులి కడుపున మేక పిల్ల పుడుతుందా? ఆయన గారి తాత గొప్ప దాత. . తండ్రి మహాభోగి. మార్తాండ వర్మ గొప్ప నిరాడంబరులు.

పాపం, అంతటి గొప్పవాణ్ణి కూడా ముసలితనం విడిచి పెట్టలేదు.

మృత్యువు ఎదురువచ్చి ఆయన కోసం వాకిట్లో కూర్చుంది. రాజావారు నిరాడంబరులు గనుక ఆసుపత్రికి తీసుకుపొమ్మనలేదు. రాకుమా రులు అంతకంటే నిరాడంబరులు గనుక, వాళ్ళూ తీసుకుపోలేదు.

ఏడుగురు రాకుమారులూ మంచం చుట్టూ చేరారు.

"నాయనలారా! నేను పోతున్నాను" అన్నారు రాజావారు.

రాకుమారులు మండిపడ్డారు. "ముసలి పీనుగా! పోతావా? నిన్ను మేము పోనివ్వం!" అన్నారు.

"బిడ్డలారా! నన్నెందుకు పోనివ్వరు?" అని అడి గారు రాజావారు.

రాకుమారులు కోపంతో పళ్ళు కొరికారు. కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు.

"మమ్మల్ని ఎలా బతకమంటావు? మా కోసం ఆస్తిపాస్తులు పెట్టావా? ఇల్లూవాకిలి కొన్నావా? ఏం తిని బతకమంటావు? మా ముత్తాత అర్ధ రాజ్యం తిని అర్ధరాజ్యం మా తాతకిచ్చాడు. మా తాత అందులో సగం తిని, మిగిలింది నీకిచ్చాడు. అందులో మా కోసం ఏమీ పెట్టక అంతా నువ్వే తినేశావు. మమ్మల్ని ఏం తినమంటావు?"

రాజావారు భారంగా నిట్టూర్చారు. తన కొడు కులనందర్నీ ఊరడించి, ఇలా అన్నారు. "నాయ నలారా! మీ తాత ఇచ్చిన ఆస్తి అంతా మీకే తినిపించాను. ఏడుగురు కొడుకులను కన్నాను గనుక తప్పు నాది. ఏడుగురూ కట్టగట్టుకొని నా కడుపున పుట్టారు గనుక కర్మ మీది! మీకు ఆస్తిపాస్తులు ఇవ్వలేదని నన్ను నిందించకండి. ఆస్తి ఉన్నంత మాత్రంలోనే సుఖంగా బతకగలమా? రోజూ తింటూ కూర్చుంటే, ఎంత ఆస్తి అయినా కర్పూరంలా కరిగిపోక తప్పదు. ఆ పిదప అడు క్కుతింటారా? పిచ్చి సన్నాసుల్లారా! అక్షయంగా ఉండే ఆస్తి మీకిచ్చిపోతానర్రా! స్వానుభవం మీద చెబుతున్నాను. నా మాట వినండి. కష్టపడి బతకండి. పెళ్ళి చేసుకోండి. పిల్లల్ని కనండి. అయితే నాలాగా కాదు. ఒక్కరు లేక ఇద్దరు చాలు. చిన్న కుటుంబం సంతోష నిలయం. పెద్ద కుటుంబం సమస్యల వలయం!..."

–రాజా మార్తాండవర్మగారి అంతిమ సందేశం ఇదే!